క్లుప్తంగా

మరికల్ ఎస్‌ఐ బదిలీ

మరికల్: మండలంలో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న అశోక్‌బాబు నాగర్‌కర్నూల్‌కు బదీలి అయ్యారు. ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ ఎస్‌ఐగా పని చేస్తున్న హరీశ్వర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. శనివారం కొత్త ఎస్‌ఐ విధులకు హాజరు అవుతారని సిబ్బంది తెలిపారు.

టీఎల్‌ఎం ప్రదర్శన

దామరగిద్ద : టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం)మేళా నిర్వహణతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని గీతం స్కూల్ కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కన్కిరెడ్డి, నీలి మాణిక్యప్పలు అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన టీఎల్‌ఎం ప్రదర్శనలో పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



మాగనూర్: మండల పరిధిలోని నేరడగం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణపక్షంలో గర్భిణులకు, బాలింతలకు చిరుధాన్యాలు, రక్తహీనతపై అవగహగ కల్పించారు. టీచర్ ఆశమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

మక్తల్: పంచదేవ్‌పాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం బోదకాలు నివారణ నేపథ్యంలో రక్త పరీక్షలు చేశారు. అదేవిధంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. ముందు జాగ్రత్తగా విద్యార్థులకు పరీక్షలు చేశామని అధికారులు తెలిపారు. సిబ్బంది శ్రీధర్, రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు నిర్మించి ఇస్తాం

నారాయణపేట టౌన్ : ఆరు నెలల లోపు నారాయణపేటలో పనిచేస్తున్న సుమారు 50 మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇస్తామని డీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయలపై విలేకరులతో చర్చించారు.

'అనుమతులు రద్దు చేయాలి'

నారాయణపేట రూరల్ : దామరగిద్ద మండలంలోని రేయిన్‌బో స్కూల్ పర్మిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం నారాయణపేట డీఈఓ లియాకత్ అలీకి వినతిపత్రం అందించారు. విద్యాశాఖ అధికారుల అనుమతులు లేకుండా చిన్నారులను విహారయాత్రకు తీసుకుని వెళ్లడాన్ని తప్పుబట్టారు. ఓ విద్యార్థిని, వారి బంధువుకు రోడ్డు ప్రమాదంలో త్రీవంగా గాయపడడానికి కారణమయ్యారని అన్నారు. సర్పంచ్ విశాలక్ష్మి, నర్సింహా, గోపాల్, భీమేష్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు సన్మానం

నారాయణపేట రూరల్ : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన డ్రైవర్లు ఎంతో మంది మన్ననలు పొందారని డీఎం ఆంజనేయులు అన్నారు. సుదీర్ఘ కాలం పాటు డ్రైవర్లుగా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన ఎంటీ అలీ, రియాజుద్దీన్‌లను సన్మానించి బహుమతులు అందించారు. అనంతరం మొగల్‌మడ్క రూట్ ప్రయాణికులు సొంత డబ్బులతో డ్రైవర్‌కు కూలర్ గిఫ్ట్‌గా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎఫ్ రాజశేఖర్, సూపరింటెండెంట్ నరేందర్, డీసీ వహిదోద్దిన్, ఏడీసీలు నారాయణ, నజీర్, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని సన్మానించిన తపస్ నాయకులు

నారాయణపేట రూరల్: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి శుక్రవారం మండలిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి తపస్ అధ్యక్షులు శేర్‌కృష్ణారెడ్డి, కార్యదర్శి నర్సింహ, గుంపుబాలరాజు, సత్యనారాయణరెడ్డిలతో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్సీని శాలువాతో సన్మానించారు.

వేడినీళ్లు పడడంతో బాలుడికి తీవ్రగాయాలు

ధన్వాడ : మండల కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో వేడినీరు పడి ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న అంగన్ వాడీలో దయ్యాల అర్జున్(4) చదువుకుంటున్నాడు. శుక్రవారం పాఠశాలలో చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తుండగా అక్కడే ఉంచిన వేడీనీరు పాత్రను దాటేందుకు ప్రయత్నించి కాలు తగిలించాడు. దీంతో నీరు మొత్తం అతడి చర్మంపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. చర్మం 30 శాతం కాలిపోయింది. దీంతో బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి పంపించారు.

అక్రమంగా మట్టి తరలింపు

- అడ్డుకున్న తహసీల్దార్



హిందుపూర్‌లోని ప్రభుత్వ భూమి పరిస్థితి ఇలా..

కృష్ణా: మండలంలోని హిందూపూర్ శివారులో ఉన్న ప్రభుత్వ భూమి (సర్వే నెంబర్ 20లో)లోని మట్టిని రెండు రోజులుగా కొందరు రాత్రి సమయాల్లో అక్రమంగా కర్ణాటక లోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణానదిపై నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి నేపథ్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా వందల టిప్పర్లలో మట్టి తరలు తోందని హిందూపూర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాము మట్టితరలింపును అడ్డుకున్నా సదరు వ్యక్తి లెక్కచేయకుండా కొసాగిస్తున్నారని అంటున్నారు. మట్టితో పాటు, కృష్ణానదిలోని ఇసుకనూ తరలిస్తున్నారని ఆరోపించారు. గతంలో నదిలో నుంచి ఇసుకను అనుమతులు లేకుండా తరలించడంపై ఆర్డీఓ, తహసీల్దార్‌లు స్పందించి సీజ్ చేశారని అయినా అక్రమాలు ఆగడం లేదన్నారు. ప్రస్తుతం మట్టి తరలింపుపై రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ వైపీ రమేష్‌ను వివరణ కోరగా తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, మట్టి తరలింపును శుక్రవారం నిలిపివేశామన్నారు. ఎవరైనా అక్రమ తరలింపులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాగిరెడ్డిపల్లిలో పోలీసు కళాజాతా



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మద్దూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో శుక్రవారం పోలీసులు కళాజాతా నిర్వహించారు. మత్తు పదార్థాలను సేవించడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. అలాగే అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, ట్రాఫిక్ చట్టాలు, సైబర్ నేరాలపై ప్రదర్శన ద్వార అవగాహన కల్పించారు. ఎఎస్‌ఐ ఉస్మాన్, కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం



మరికల్: మండలంలోని జిన్నారం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారందరూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 20 రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో కంటి వెలుగుసిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీక్యూ కిట్ల పంపిణీ

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎన్‌సీక్యూ కిట్లను శుక్రవారం రోగులకు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగాలు అయిన షుగర్, బీసీ ఉన్నవారికి ఈ కిట్లను అందజేస్తున్నారు. మొత్తం 1000 కిట్లు వచ్చాయని సిబ్బంది తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రెగ్యులర్‌గా పరీక్షలు చేయించుకునే వారికి కిట్లు అందజేస్తామన్నారు.



యువతి అదృశ్యం : కేసు నమోదు

ఊట్కూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (22) అదృశ్యమైందని, ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాములు తెలిపారు. శ్రీరామనవమి రోజున సదరు యువతి గుడికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని అన్నారు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్లలో వెతికారని, ఆచూకీ లభించక పోవడంతో ఫిర్యాదు చేశారని అన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



మక్తల్: పట్టణంలో షరీఫా మసీద్ వద్ద ముస్లింలకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణ అధ్యక్షుడు రవికుమార్ సమక్షంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సిములు, అనంద్‌గౌడ్, నజీర్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో..

నర్వ: మండలంలోని రాయికోడ్‌లో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్, రైతు సమితి అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ తాయన్నగౌడ్, నాయకులు నారాయణరెడ్డి, మల్లేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఏఎంఓ విద్యాసాగర్

ధన్వాడ: మండలంలోని చీరల నర్సయ్యతండా, మడిగెల మూల తండాల్లో జిల్లా ఏఎంఓ విద్యాసాగర్ శుక్రవారం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులలో రాయడం, చదవడం, కొలతలు చేయడం వంటి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులలో నైపుణ్యాలను పెంచడానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సీఆర్పీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని కొల్లంపల్లి క్లస్టర్ హెచ్‌ఎం సల్మాన్‌రాజ్ అన్నారు. శుక్రవారం లింగంపల్లి, పిల్లిగుండ్లతండా ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. టీచర్లు సమయపాలన, ఇతర అంశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. సీఆర్పీ రవికుమార్, హెచ్‌ఎంలు రాజేశ్వరి, నవిత పాల్గొన్నారు.

మత్స్యకారులను బీసీ ఏ లో చేర్చాలి

ధన్వాద: మత్స్యకార్మికులను బీసీ-ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు అన్నారు. శుక్రవారం ధన్వాడ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు సన్మానకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజులు ఐక్యత, అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ఒకతాటిపైకి రావాలని ఆయన కోరారు. ప్రభుత్వ మత్స్య బంధును అందజేయాలని డిమాండ్ చేశారు సంఘం అధ్యక్షుడు నీరటి నర్సిములు నాయుడు, గొని శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ మారుతి, శ్రీనివాసులు, చిన్ననర్సిములు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షల్లో సత్తాచాటాలి



వద్వాట్‌లో వీడ్కోలు సమావేశం



జాజాపూర్‌లో..

నారాయణపేట రూరల్ : విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని లయన్స్‌క్లబ్ గవర్నర్ హరినారాయణబట్టడ్ అన్నారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీ హై స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా శౌర్య చిట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను అందించారు. సర్పంచ్ సుగంధమ్మ, పరీక్షల విభాగం అధికారి రాజేంద్రకుమార్, డీఎస్‌ఓ భానుప్రకాష్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మొల్గాన్ జనార్దన్, కోశాధికారి రవికుమార్‌గౌడ్, కనకప్ప పాల్గొన్నారు.

మక్తల్: గుడిగండ్లలో శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల్లో సత్తాచాటాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: మండల పరిధిలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల, హకీంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల్లో కార్యక్రమాలు జరిగాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మాగనూర్: వద్వాట్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సర్పంచ్ నర్సింహులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి, ఎంపీటీసీ సుదర్శన్‌గౌడ్, విద్యా కమిటీ చైర్మన్ వాకిటి శ్రీను, ఉపసర్పంచ్ సరస్వతి, రాములు, బసంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ఊట్కూరు: మండలంలోని అవుసలోనిపల్లికి చెందిన వెంకటేష్ ఆన్‌లైన్‌లో రూ. 7 వేలు మోసపోవడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేష్ తన మొబైల్ దార్వా లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొన్నాడు. రూ. లక్ష లోన్ తీసుకోవాలని ప్రయత్నించాడు. ఆన్‌లైన్‌లో వారితో చాటింగ్ చేయగా ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ వివరాలు అప్లోడ్ చేయాలని తెలిపారు. దీంతో అతడు వివరాలు ఇచ్చాడు. దీంతో వారు లోన్ మంజూరు అయ్యిందని అకౌంట్ నంబర్ రీకనెక్షన్ కోసం రూ.7 వేలు కట్టాలని కూఆర్ కోడ్ పంపించారు. దీంతో అతడు డబ్బులు పంపగా అదనంగా రూ.20 వేలు పంపాలని వారు మెసేజ్ పెట్టారు. దీంతో వెంకటేష్‌కు అనుమానం వచ్చింది. లోన్ క్యాన్సల్ చేయాలని అడుగగా అవతలి వ్యక్తులు ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ



అనుగొండలో..

నారాయణపేట రూరల్ : రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకుని ఉండాలని పోలీసు అధికారులు అన్నారు. ప్రతి నెల ఆఖరిరోజు జిల్లాలో సివిల్‌రైట్స్ డే నిర్వహించాలనే ఎస్పీ ఆదేశాల మేరకు ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

మక్తల్: ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని ఎస్‌ఐ పర్వతాలు అన్నారు. శుక్రవారం అనుగొండ లో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. సర్పంచ్ గద్దం రమేష్, ఎంపీటీసీ పద్మ, ఉప సర్పంచ్ కొండప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్లలో శుక్రవారం రెవెన్యూ, పోలీసుల అధికారులు కలిసి పౌరహక్కుల దినోత్సవాన్ని చేపట్టారు. ఏఎస్‌ఐ మహమ్మద్ అబ్జల్ మాట్లాడుతూ పౌరహక్కులపై అవగాహన అవసరం అన్నారు. హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలని కోరారు. సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఆర్‌ఐ రాజేశ్వరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నర్వ: రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకుందామని ఎస్‌ఐ విక్రమ్ అన్నారు. శుక్రవారం పెద్దకడ్మూర్ గ్రామంలో సివిల్ రైట్స్ డే సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్‌ఐ అమరేందర్, విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, గ్రామ పెద్దలు జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

మాగనూర్: మండలంలోని పూంజనూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వ పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉన్నత విలువలను చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన చిన్నారులు చాలా చక్కగా ఆకట్టుకున్నారని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



'అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి'

నర్వ: పేదల భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గౌనిజ్యోతి, సర్పంచ్ అరవింద్‌రెడ్డి డిమాండ్ చేశారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నిరుపేదల భూములు, ప్రభుత్వ, ఇనాం, దేవాదాయ భూములను అధికారులతో కుమ్మక్కై రైతుల ప్రమేయం లేకుండానే కొందరు అక్రమ పట్టాలు చేసుకుంటున్నారని అన్నారు. ఇటీవల కుమార్ లింగంపల్లిలో కొందరు అక్రమ పట్టా చేసుకున్నారని ఆరోపించారు. వెంటనే పూర్తిగా సమాచారం సేకరించి సదరు వ్యక్తులపై, సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొందరు అన్ ఆథరైజ్డ్ వ్యక్తుల వల్లే ఇలాంటివి వెలుగు చూస్తున్నాయని రైతులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. ఇలాంటివి జరగకుండా చూడాల్సిన బాధ్యత తహసీల్దార్‌దేనన్నారు. విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

చేగుంటలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో పార్వతీ పరమేశ్వరులు

కృష్ణా: మండల పరిధిలోని చేగుంటలో శుక్రవారం పార్వతీ పరమేశ్వరుల బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్షీరలింగ మహాస్వామి మాట్లాడుతూ గ్రామం నుంచి ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకెళ్లడంతో పాటు, పల్లకీసేవ, ప్రత్యేకపూజలు నిర్వహించినట్లు వివరించారు. ఏప్రిల్ 1 శనివారం ఉదయం ఆలయంలో అలంకరణ, రుద్రాభిషేకం, బిల్వార్చన, పల్లకీసేవ, నందికోలు, సాయంత్ర ప్రభోత్సవం ఉంటాయన్నారు. 2న ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవం, రాత్రికి భక్తి ప్రవచనాలు, భజనలు ఉంటాయని తెలిపారు. సోమవారం సందెపురాళ్లు ఎత్తడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేశామని సర్పంచ్ శివప్ప తెలిపారు. తాగునీరు, వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు.

ఇంటర్వ్యూల వాయిదాపై వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఊట్కూరు: మండల పరిషత్ కార్యాలయంలో తలపెట్టిన మైనార్టీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలను వాయిదా వేయాలని కోరుతూ శుక్రవారం మైనార్టీ నాయకులు, లబ్ధిదారులు ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. మండలానికి 7 యూనిట్లు మాత్రమే మంజూరు చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం వంద యూనిట్లు మంజూరు చేయాలని ఈ విషయమై త్వరలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందిస్తామని అన్నారు. అప్పటి వరకు వాయిదా వేయాలని కోరారు. దీంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ కాలప్ప ప్రకటించారు. విఖార్ అహ్మద్, ఇస్మాయిల్, ఆసిఫ్ తదితరులు ఉన్నారు.

మూడోసారి టెండర్ రద్దు



టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

కోస్గి: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పశువుల సంతకు టెండర్ల ద్వారా వేలం పాటలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మ్యాకల శిరీష అధ్యక్షతన కమిషనర్ పూర్ణచందర్ రావు టెండర్లు నిర్వహించారు. నిర్ణీత ధర రాకపోవడంతో టెండర్‌ను అధికారులు రద్దు చేశారు. కాగా పశువుల సంత కోసం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గత నెల 28న కంపెనీ ధర ఎక్కువగా ఉందని టెండర్‌దారులు వేలం పాటను బహిష్కరించారు. అదేవిధంగా 29న మరోమారు టెండర్లు నిర్వహించినప్పటికీ నిర్ణీత ధర రాకపోవడంతో రెండోసారీ రద్దు చేశారు. తాజాగా శుక్రవారం మూడోసారి నిర్వహించగా మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. దీంతో నిబంధనల మేరకు మూడుసార్లు టెండర్లు నిర్వహించి నిర్ణయించిన ధర రాని పక్షంలో మున్సిపల్ ఆధ్వర్యంలోనే పశువుల సంతను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పూర్ణచందర్ రావు తెలిపారు. మున్సిపాలిటీ సిబ్బంది, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, టెండర్‌దారులు పాల్గొన్నారు.

విద్యార్థులను గాలికి వదిలి చీరల కొనుగోలు!

నారాయణపేట రూరల్ : మండలంలోని కొల్లంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వారు విద్యార్థులను గాలికి వదిలి చీరల కొనుగోలుపై దృష్టి సారించారని పలువురు ఆరోపిస్తున్నారు. నారాయణపేట చీరలకు ప్రత్యేకత ఉండడంతో పాఠశాల సమయం తర్వాత దుకాణానికి వెళ్లి కొనకుండా శుక్రవారం నేరుగా పాఠశాల వద్దకే గ్రామానికి చెందిన చేనేత వ్యాపారిని పిలిచి చీరలు కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఒక గది నుంచి మరో గదికి చీరలను పిల్లలతో మోయిస్తూ టీచర్ కట్టి పట్టుకుని ముందు నడుస్తున్న వీడియో వైరల్‌గా మారింది. దీనిపై డీఈఓ లియాకత్ అలీని వివరణ కోరగా విచారణ చేసి రిపోర్టు ఇవ్వాల్సిందిగా ఎంఈఓ గోపాల్‌నాయక్‌ను ఆదేశించినట్లు చెప్పారు. మెమో జారీ చేసి వారి వివరణ తీసుకుంటున్నట్లు చెప్పారు.

రైతులకు అండగా ఉంటాం



పనులు ప్రారంభిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మాగనూర్: రైతుల సంతోషమే తమకు ముఖ్యమని, వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. ఇటీవల రైతులు సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి కాల్వ ద్వారా చివరి వరకు సాగు నీరు రావడం లేదనే అంశాన్ని ఆయనకు తెలుపగా, ఇచ్చిన మాటప్రకారం కాల్వల్లో పిచ్చిమొక్కలు, చెట్లు తొలగించే పనులు శుక్రవారం ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

బిందుసేద్యంపై శిక్షణ

మద్దూరు: బిందు సేద్యం పరికరాల వినియోగంపై ఉపాధి కూలీలకు యూత్ ఫర్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం, మదనాపురం చెందిన శాస్త్రవేత్త మస్తాన్ మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మద్దూరు, కోస్గి, దామరగిద్ద మండలాలకు చెందిన కూలీలకు కార్యక్రమం ఏర్పాటు చేశారు. శుక్రవారం శిక్షణ ముగింపు వారు మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. డీపీఎం మాసన్న, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ ఉదయ్‌కాంత్, ఏపీఓ నాగరాజు, ఏపీఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మస్తాన్

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కృష్ణా: కున్సిలో వేణుగోపాలస్వామి రథోత్సవం శుక్రవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలంకరణ, పల్లకీసేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకలకు వేలాదిమంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు తాగునీరు, వసతి, భోజన సౌకర్యాలను కల్పించినట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు.

ధన్వాడ: మండల కేంద్రంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహిస్తున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున రథోత్సము ఘనంగా నిర్వహించారు. భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు.

వక్ఫ్ భూమి ఆక్రమణపై విచారణ చేపట్టాలి

కోస్గి: మున్సిపల్ పరిధిలో వక్ఫ్‌కు సంబంధించిన భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించారని, ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మైనార్టీ నాయకులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే పనులను ఆపి సమగ్ర విచారణ జరిపి వక్ఫ్ భూములను కాపాడాలని తహసీల్దార్ మమత, మున్సిపల్ కమీషనర్ పూర్ణచందర్ రావులకు విన్నవించారు. పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.